శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు


విస్సాకోడేరు జగనన్న కాలనీలో శ్లాబ్ లెవెల్‌కు సిద్ధమైన ఇళ్లు


బేస్‌మెంట్ లెవెల్ పూర్తయిన దృశ్యం


కాంక్రీట్‌తో బోర్లు నింపుతున్న కార్మికులు

- విస్సాకోడేరు జగనన్న కాలనీలో ఒకేచోట 3,600 ఇళ్ల పనులు
- ఎమ్మెల్యే గ్రంధి చొరవతో వేగంగా ముందుకు సాగుతున్న వైనం
- ఇప్పటికే బేస్‌మెంట్ లెవెల్లో 600, శ్లాబ్‌లకు సిద్ధంగా 50 ఇళ్లు

సాక్షి, భీమవరం: పట్టణంలోని విస్సాకోడేరు జగనన్న కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు ఆప్షన్-3లో కాంట్రాక్టర్‌తో ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేసిన కృషి ఫలించి ఒకేచోట 3,600 ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దీనికి గాను ప్రభుత్వ నిబంధనల ప్రకారం, లబ్ధిదారుల ఆకాంక్షల మేరకు ఇళ్లు నిర్మించేలా కాంట్రాక్టర్‌తో లబ్ధిదారులు ఒప్పందం కుదుర్చుకుని ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

ఇళ్ల నిర్మాణం ఇలా..

పట్టణంలోని విస్సాకోడేరు జగనన్న కాలనీలో 3,600 మందికి ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబు ముందుకు రావడంతో పనులు ఊపందుకున్నాయి. వర్షాకాలంలో సైతం పనులకు ఆటంకం లేకుండా ఇనుము, సిమెంట్, ఇసుక, కంకర వంటివి ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 1,200 ఇళ్లకు బోర్లు పని పూర్తి చేయగా 600 ఇళ్లు బేస్మెంట్ లెవెల్‌లో, 150 ఇళ్లు లెంటల్ లెవెల్, 50 ఇళ్లు స్లాబ్‌లెవెల్ దశలో ఉన్నాయి.

లబ్ధిదారులతో ఒప్పందం ఇలా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం 10 అడుగుల లోతు బోర్లు వేస్తారు. వాటికి ఆర్‌సీసీ కాంక్రీట్ వేస్తారు. ఆర్‌సీసీ ఫ్లింత్ బీమ్‌తో కలిసి నాలుగు అడుగుల ఎత్తు సిమెంట్‌రాయితో బేస్మెంట్, దీనిని ఇసుకతో నింపడం, గోడలు, రూఫ్ బీమ్, నాలుగు అంగుళాల స్లాబ్ వంటి పనులు చేస్తారు.

రూ.3.30 లక్షల ఖర్చుతో..

ఇంటి నిర్మాణానికి మొత్తం రూ.3.30 లక్షల ఖర్చు అవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుంది. అలాగే డ్వాక్రా గ్రూప్ మహిళలకు రూ.35 వేలు బ్యాంకు రుణం ఇస్తుండగా, లబ్ధిదారుల వాటాగా రూ.1.15 లక్షలు చెల్లిస్తే అతి తక్కువ రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తవుతుంది.

యంత్రాల వినియోగం

జగనన్న కాలనీల్లో పెద్ద సంఖ్యలో ఇళ్లు నిర్మిస్తున్నందున కాంట్రాక్టర్ ఎక్కువగా యంత్రాలనే వినియోగించే విధంగా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే బోర్లు వేయడానికి, కాంక్రీట్ కలపడానికి మిక్సర్ యంత్రం, శ్లాబ్‌కు లిఫ్ట్ మెషీన్ వినియోగిస్తున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసే అవకాశం ఉంది.

ఇళ్లు వేగంగా నిర్మించి ఇస్తాం



సీఎం వైఎస్ జగన్ ఆశయం మేరకు భీమవరంలో పేదలకు వేగంగా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారి కోసం అభిరుచి, ఆర్థిక స్తోమతను బట్టి ఇళ్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు. దీనితో పనులు వేగంగా జరుగుతున్నాయి. మే నాటికి వెయ్యి ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్యే, భీమవరం

డిసెంబర్ నాటికి పూర్తవుతాయి



విస్సాకోడేరు జగనన్న కాలనీలో 3,600 ఇళ్ల నిర్మాణానికి అన్నీ సిద్ధం చేశాను. ఇందుకోసం వెయ్యి టన్నుల ఇనుము, 12 వేల బస్తాల సిమెంట్, వెయ్యి లారీల ఇసుక ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో స్టాక్ ఏర్పాటు చేశాం. ఈ ఏడాది డిసెంబర్ నాటికి నాకు అప్పగించిన 3,600 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేయిస్తున్నా.

– పళ్ల ఏసుబాబు, కాంట్రాక్టర్, భీమవరం

ఇంటర్ పరీక్షకు 24 మంది గైర్హాజరు


దుంపగడప జూనియర్ కళాశాలలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ఆకివీడు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 560 మంది పరీక్షలు రాశారు. మొత్తం 584 పరీక్ష రాయాల్సి ఉండగా 24 మంది గైర్హాజరయారని డిపార్ట్‌మెంటల్ అధికారులు తెలిపారు. దుంపగడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 210 మంది, కాకతీయ జూనియర్ కాలేజీలో 184, విద్యావికాస్ జూనియర్ కాలేజీలో 166 మంది పరీక్షలు రాశారని చెప్పారు.

ఎమ్మెల్సీగా కవురు గెలుపుపై హర్షం


కవురు శ్రీనివాస్, వంక రవీంద్రలకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

వీరవాసరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కవురు శ్రీనివాస్ విజేతగా నిలవడంపై మండల ప్రజలు గురువారం హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీలో బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తారనడంలో కవురు శ్రీనివాస్ నిదర్శనంగా నిలుస్తారని పేర్కొన్నారు. పొలమూరు శివారు నాగులదిబ్బలో జన్మించిన శ్రీనివాస్ మండలంలోని నవుడూర్ జంక్షన్‌లో గత 35 ఏళ్లుగా స్థిరపడ్డారు. ఉత్తరపాలెం నుంచి తొలిసారి ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నికై మండల పరిషత్ అధ్యక్షుడిగా పదవిని అలంకరించారు. అనంతరం పార్టీ ఆచంట ఇన్‌చార్జిగా, రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జిగా, డీసీసీబీ చైర్మన్‌గా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పలు పదవులను అలంకరించిన కవురు శ్రీనివాస్ తిరిగి ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడంపై మండల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాలతో పాటు రైతులు, మహిళలకు, యువతకు కవురు అండగా నిలుస్తున్నారు. ఏ పదవి చేపట్టినా అవినీతికి దూరంగా, మంచి మనిషిగా, ప్రజా సేవలో ముందుండే నాయకుడిగా కవురు శ్రీనివాస్ గుర్తింపు పొందారన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, మాజీ జెడ్పీటీసీ మానుకొండ ప్రదీప్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల కనకారావు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, భోగిరెడ్డి శ్రీనివాస్, గొలగాని సత్యనారాయణ, సర్వేశ్వరరావు, గద్దం భాస్కరరావు, షేక్ సత్తార్ సాహెబ్, చికిల మంగతాయారు, గద్దం భారతి, కోడి అప్పారావు, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, యర్రంశెట్టి శ్రీనివాసరావు, ముద్రగడ ఏసురాజు, మేకల వెంకటచలపతి ఉన్నారు.

మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి


గుట్లపాడులో పొట్టి శ్రీరాములు, నెహ్రూ, గాంధీజీ విగ్రహాలను ఆవిష్కరించిన దృశ్యం

భీమవరం అర్బన్: దేశం, రాష్ట్రం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల త్యాగాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, మావుళ్లమ్మ దేవస్థానం చైర్మన్ పరిపాటి శ్రీను అన్నారు. గుట్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు, జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ విగ్రహాలను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు వారి ఆశయ సాధనకు పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. జవహర్ లాల్ నెహ్రూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లారన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో శాంతి, సత్యం, అహింసలను ఆయుధాలుగా మార్చుకుని మహాత్మాగాంధీ బ్రిటిష్ వారిని పారద్రోలారని అటువంటి మహానుభావులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్పంచ్ ఒడుగు ముత్యాలరావు, మానేపల్లి నాగన్నబాబు, సత్యవరపు శ్రీకాంత్, సోము వెంకటేష్, జూలూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అడిషినల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీస్పీ ఎం.సత్యనారాయణ, ఆర్ఐ శ్రీకాంత్, డీపీఓ ఏఓ రామ్మోహన్, ఎస్బీ ఎస్ఐ శ్రీనివాస్, డీసీఆర్బీ సీఐ అహ్మద్ ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.

టుటౌన్ పోలీసు స్టేషన్‌లో..

టుటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ బి.కృష్ణకుమార్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాంబాబు, ఏఎస్ఐలు బాలాజీ, మోహన్‌రావు, ఇందుకూరి శివాజీవర్మ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రయాణికులకు మరిన్ని సేవలు


జీఆర్ఈ సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య చౌదరి

భీమవరం (ప్రకాశంచౌక్): సమన్వయంతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేద్దామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి అన్నారు. గురువారం తన కార్యాలయంలో గ్రూప్ ఆఫ్ రూట్ వైజ్ ఎంప్లాయిస్ మీటింగ్‌ను నిర్వహించారు. భీమవరం డిపో పరిధిలో భీమవరం – విజయవాడ రూట్‌లో పని చేస్తున్న బస్సు డ్రైవర్లు, కండక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వీరయ్యచౌదరి మాట్లాడుతూ ఈ రూట్‌లో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు ఎలా అందించగలమో, ఎటువంటి మార్పులు చేస్తే ప్రయాణికులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందో వంటి అంశాలపై సూచనలను డ్రైవర్లు, కండక్టర్ల నుంచి స్వీకరించారు. షెడ్యూల్ సమయం కంటే అరగంట ముందే బస్సును ఇవ్వాలని, వెహికల్ కండిషన్ మెరుగుపరచాలని కోరారు. వీరయ్య చౌదరి మాట్లాడుతూ డ్రైవర్లు కోరిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. భీమవరం డిపో మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుడి కుమార్తె వైద్యానికి ఆర్థిక సాయం

సాక్షి, భీమవరం: కష్టపడి సంపాదించినదానిలో కొంత మొత్తాన్ని తోటి కార్మికుడి కుమార్తె వైద్యఖర్చుల కోసం ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. పాలకోడేరు మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన గుడాల గంగాధర్ ఆటో కార్మికుడు. అతని తొమ్మిదేళ్ల కుమార్తె వైష్ణవి తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. వైద్యం కోసం పెద్ద మొత్తంలో ఖర్చుచేయాల్సి ఉండడంతో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ, పట్టణ కమిటీ అధ్యక్షుడు పంపన గోపి ఇతర ఆటో కార్మికులకు విషయం తెలిపారు. పట్టణంలోని ఆటో యూనియన్ల నుంచి సుమారు రూ.2.36 లక్షలు సేకరించి నాయకులు చేతుల మీదుగా గురువారం వైష్ణవి కుటుంబ సభ్యులకు అందజేశారు.

జగన్ పాలనలో బీసీలకు ప్రత్యేక స్థానం


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

కాళ్ల: రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నియోజకవర్గ బీసీ నాయకులు అన్నారు. పెదఅమిరంలోని వైఎస్సార్ సీపీ ఉండి ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు కార్యాలయంలో ఉండి నియోజకవర్గ బీసీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఇప్పటివరకు పనిచేసిన కవురు శ్రీనివాస్ ఎమ్మెల్సీగా గెలుపొందిన నేపథ్యంలో ఆ పదవిని మళ్లీ బీసీలకే కేటాయించాలన్నారు. మండల బీసీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావుకు చైర్మన్ పదవి ఇస్తే బాగుంటుందని నాయకులు తీర్మానించారు. దీని ద్వారా టీడీపీ కంచుకోట అయిన ఉండి నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీకి పట్టు ఏర్పడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో పీవీఎల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుక ఇద్దామని తీర్మానం చేశారు. బీసీ నాయకులంతా పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నాలుగు మండలాల బీసీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పీవీఎల్ దృష్టికి తమ అభ్యర్థనను తీసుకెళతామన్నారు. తద్వారా ఆయన అధిష్టానం దృష్టికి తీసుకెళతారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలుగా గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్‌లకు బీసీ నాయకులంతా శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ గ్రీవెన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కరిమెరక రామచంద్రరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు సురవరపు వెంకటాచార్యులు, బీసీ కన్వీనర్ రణస్తుల మహంకాళి, సిరపు శ్రీను, కౌన్సిలర్ వంగా జ్యోత్స్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మన్నే పోతురాజు, ఆకివీడు మండల కన్వీనర్ గుండుగొలను ధనరాజు, మాజీ సర్పంచ్ వీరమల్లు మోహనరావు, కోనా జోసెఫ్, ఎండీ జహంగీర్, పెన్మెత్స విశ్వనాథరాజు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ పోర్టల్ సేవలు ఉపయోగించుకోవాలి

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో పరిశ్రమల అవసరాలకు సంబంధించి సాంకేతిక నిపుణుల కోసం అప్రెంటిషిప్ పోర్టల్ సేవలు ఉపయోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఉభయ తెలుగు రాష్ట్రాల రీజియన్ ప్రాంతీయ డైరెక్టర్ కొప్పర్తి శ్రీనివాసరావు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్నెస్ క్యాంప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలు, సాంకేతిక విద్యాసంస్థల సమన్వయంతో నిపుణులను పరిశ్రమలకు అందించాలని స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ విధానమన్నారు. పరిశ్రమలు శిక్షణ పొందిన సాంకేతిక నిపుణుల సేవలను సద్వినియోగం చేసుకుంటే ఉత్పత్తి మరింత పెరుగుతుందన్నారు. ఐటీఐల ప్రాంతీయ డైరెక్టర్ డి.నాగవర్ధనరాజు, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణంరాజు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరాజు, ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రజిత పాల్గొన్నారు.

నేటి నుంచి బొండాడలో కల్యాణోత్సవాలు

కాళ్ల: బొండాడలో వేంచేసియున్న శ్రీభోగేశ్వరస్వామి, శ్రీజనార్దనస్వామివారి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ ఈఓ వేగేశ్న ఆంజనేయరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీస్వామి, అమ్మవార్లకు ప్రతిరోజు అభిషేకాలు, సహస్రనామ పూజలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివార్లను పెండ్లి కుమారులు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించనున్నట్లు తెలిపారు. 19న రాత్రి ఆలయ చైర్మన్లు నందుల నారాయణమూర్తి, మందపాటి రాము ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వివరించారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ దృష్టికి చెరువు సమస్య

ఉండి: పాములపర్రులో దళిత చెరువు ఆక్రమణ విషయమై ఇటీవల ధర్నా చేసిన దళితులు ఈ సమస్యను రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లినట్లు బహుజన జేఏసీ యాక్షన్ కమిటీ నాయకుడు దానం విద్యాసాగర్ చెప్పారు. గురువారం జేఏసీ యాక్షన్ కమిటీ కన్వీనర్ తాళ్లూరి మధు, రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసెఫ్ ఆధ్వర్యంలో పాములపర్రు విజయవాడలోని ఎస్సీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. చెరువు ఆక్రమణలపై వారు వివరించినట్లు తెలిపారు. అనంతరం కమిషన్ చైర్మన్ భీమవరం ఆర్డీవో, డీఎస్పీలకు ఆదేశాలు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు. అనిపే నాగేశ్వరరావు, మామిడిపెల్ల ఏసేబు, దర్శి చినపరదేశి, జొదుల రమేష్ పాల్గొన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ విజేతలకు శుభాకాంక్షలు

ఉండి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ ఉప్పులూరు ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, పాములపర్రు మాజీ ఎంపీటీసీ వర్రె పైడియ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాసరి సనాతన గురువారం వారిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉండిలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఉన్న అభిమానం వల్లే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారన్నారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

భీమవరం (ప్రకాశంచౌక్): మంచినీటి సరఫరా పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం పట్టణంలోని 29వ వార్డు నుంచి 39 వార్డుల వరకు ఆయా ప్రాంతాల్లో కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ గురువారం చెప్పారు. మంచినీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

కొనసాగుతున్న యాగం

భీమవరం (ప్రకాశంచౌక్): హౌసింగ్ బోర్డుకాలనీలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న యాగ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, టీటీడీ ఎస్వీబీసీ చానల్ అడ్వైజర్ అడపా దుర్గ పాల్గొన్నారు. వారికి ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు స్వామివారి శేష వస్త్రం, ఆగమ పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. కుక్కల బాలవెంకటరత్నం, జానపాటి మధు, మట్టపల్లి మోహన్, గోన్నాబత్తుల మల్లేశ్వరరావు, సయ్యపరాజు సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

సైక్లిస్ట్‌ను తప్పించబోయి..

పాలకోడేరు: సైక్లిస్టును తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఓ మోటార్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. శృంగవృక్షం గ్రామానికి చెందిన గణేసుల నాగ పద్మారావు గురువారం ఉదయం మోటారుసైకిల్‌పై భీమవరం వెళుతున్నాడు. పెన్నాడలో ఓ వీధి నుంచి రోడ్డుపైకి వేగంగా ఓ సైక్లిస్ట్ వచ్చాడు. అతనిని తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పద్మారావుకు తీవ్రగాయాలు కాగా, సైక్లిస్టుకు కూడా గాయాలయ్యాయి. పద్మారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ధనుంజయ్ చెప్పారు.

కుముదవల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్

పాలకోడేరు: గ్రామాలకు వచ్చి అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని అన్నారు. కుముదవల్లిలో పీహెచ్‌సీ డ్రాయింగ్ అధికారి డాక్టర్ రంగం నాయుడు సూచనల మేరకు 104 సిబ్బంది సహాయంతో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ నిరంజని గర్భిణులు, బాలింతలకు బీపీ, సుగర్, కీళ్ల నొప్పులు, ఇతర సమస్యలపై పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. అదేవిధంగా గ్రామస్తులకు ఆరోగ్య సలహాలను అందించారు సూపర్‌వైజర్లు నాగమణి, అయ్యప్ప శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీలు మహాలక్ష్మి, వల్లి, ఏఎన్ఎం హేమలత, హెల్త్ అసిస్టెంట్ ఎం విజయ ప్రసాద్ పాల్గొన్నారు.

నులిపురుగుల ప్రభావంతోనే రక్తహీనత

సాక్షి, భీమవరం: నులిపురుగుల ప్రభావంతో రక్తహీనత, శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు ఏర్పడతాయని ప్రభుత్వ వైద్యాధికారిణి డి.కృష్ణదుర్గ అన్నారు. భీమవరం ఆర్ఆర్ డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతమైన జాతి.. మెరుగైన సమాజానికి దారితీస్తుందని, యువత ఆరోగ్యంగా ఉన్నపుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ ప్రధానంగా ఆడపిల్లలు పౌష్టికాహారం లోపం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని, అందువల్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు కార్యకర్తల సమావేశం

సాక్షి, భీమవరం: రాష్ట్రవ్యాప్తంగా మాలమహానాడును బలోపేతం చేయడానికి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తూ కమిటీలో కష్టపడిన వారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. గురువారం చినఅమిరంలో ఏర్పాటుచేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా చిరుగుపాటి రాజేష్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. అనంతరం పుష్పరాజ్ మాట్లాడుతూ నూతన కమిటీలోని నాయకులు మాలమహానాడు ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, నేతల సువర్ణరాజు, కోలాటి ప్రసాదరావు, నన్నేటి నాగరాజు, మానుకొండ కిరణ్, పిట్టా వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పోలేరమ్మకు బంగారు సూత్రాల సమర్పణ

ఆకివీడు: చెరుకుమిల్లి గ్రామ దేవత పోలేరమ్మకు గ్రామస్తురాలు మంటలమ్మ రూ.లక్ష విలువైన రెండు కాసుల బంగారు సూత్రాల్ని గురువారం అందజేశారు. గ్రామంలో పోలేరమ్మ, మారెమ్మ, భద్రకాళి అమ్మవార్ల జాతర వారం రోజులుగా వైభవోపేతంగా జరిగింది. జాతర ముగింపు రోజు గురువారం దాత మంటలమ్మ బంగారు సూత్రాల్ని తీసుకువచ్చి ఆలయ అర్చకులకు, గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఆమె గతంలో కాళ్లకూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి అర ఎకరం భూమిని విరాళంగా అందజేయడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆలయంలో ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు.

ఈ-క్రాప్‌పై సమీక్ష

భీమవరం అర్బన్: రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ కోరారు. కొమరాడ ఆర్‌బీకేలో గురువారం ఈ క్రాప్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదులో సర్వే నెంబర్లు, భూవిస్తీర్ణం తదితర వంటివి నమోదు కాకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను నమోదు చేసుకున్నారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

భీమవరం అర్బన్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తాడేరులో గురువారం మందా శంకర్రావు పాల ప్యాకెట్లు తీసుకుని రోడ్డుపైకి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే అతనిని భీమవరంలోని ఆస్పత్రికి తరలించారు. శంకర్రావు ఫిర్యాదు మేరకు ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు ఆటంకంపై కేసు

ఆకివీడు: నీటి ప్రవాహానికి అడ్డుగా తూరలు వేయడమే కాక, తొలగించేందుకు వెళ్లిన తన విధులకు అడ్డు తగిలారంటూ వీఆర్వో ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. రాజులపేట గ్రామంలో గొట్టముక్కల వెంకట సూర్యనారాయణరాజు ప్రభుత్వ భూమిలో నీటి ప్రవాహానికి అడ్డంగా తూరలు నిర్మించారు. వీటిని తొలగించేందుకు వీఆర్వో బందా హరిచంద్ర ప్రసాద్ వెళ్లగా, వాటిని తొలగించకుండా సూర్యనారాయణరాజు అడ్డుకున్నాడు. తూరలు తీయకుండా వాటిపై కారును ఉంచినట్లు వీఆర్వో ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

ఆకివీడు: ఓ యువతిని వడలివారి వీధిలో నివసిస్తున్న కె.మోహన్ కార్తీక్ అత్యాచార యత్నానికి పాల్పడ్డ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి గురువారం చెప్పారు. యువతిని గత కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నట్లు, ఈ నెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చి బలాత్కరించబోయాడని, ఆ సమయంలో కేకలు వేయగా తన పిన్ని వచ్చి అతన్ని తిట్టి పంపించినట్లు ఎస్ఐ చెప్పారు. పెళ్లికి నిరాకరించిన ఆమె ఈ రోజు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చినమిల్లిపాడులో పాత అవ్వమ్మపై బంధువులు దాడి చేశారని, ఆమె చేసిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి చెప్పారు. ఈ నెల 14న తన కూతురిపై అత్తమామలు, ఆడపడుచు ఘర్షణకు దిగారని, దీంతో ఎందుకు గొడవ పడుతున్నారని, అడ్డుకునేందుకు వెళ్లిన తనను చేతులతో, కాళ్లతో కొట్టి చాకుతో దాడి చేశారని అవ్వమ్మ ఫిర్యాదు చేసిందన్నారు.

ఉత్తరాలపై అవగాహన

ఆకివీడు: అజ్జమూరు ఎంపీపీ పాఠశాలలో ప్రాథమిక విద్యాబోధనలో భాగంగా తపాలాశాఖపై పాఠ్యాంశాన్ని విద్యార్థులకు గురువారం వివరించారు. పోస్టుమేన్ బాలకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాల బట్వాడా, రవాణా వంటి విషయాల్ని పిల్లలకు తెలియజేశారు. ఉత్తరం రాసే విధానాన్ని విద్యార్థులకు హెచ్ఎం ఆర్వీ.నారాయణ వివరించారు.